


అదిగదిగో పులి

● వేద వర్సిటీలో సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించింది. హాస్టల్ వద్ద దీని జాడలు కనిపించాయి. ఈ విషయమై విద్యార్థులు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు ఉనికిని గుర్తించి సెల్ ఫోన్‌లో చిరుత సంచారాన్ని చిత్రీకరించారు. కొంత కాలం క్రితం ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వెనుక చిరుతను బంధించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మళ్లీ యూనివర్సిటీల్లో చిరుత సంచారం ఆందోళన కలిగిస్తోంది. ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో వర్సిటీల పరిసరాల్లో తిరుగుతున్నట్లు భావిస్తున్నారు.

నేటి నుంచి బడులకు కొత్త టీచర్లు



ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు: 2,368
నియామక నోటిఫికేషన్ ఇచ్చింది: 1,478
డీఎస్సీకి దరఖాస్తు చేసింది: 23,500 మంది
రాత పరీక్షకు అర్హత సాధించింది: 21,340
పరీక్ష రాసింది: 19,550
టీచర్లుగా ఎంపికైంది: 1,403
శిక్షణ, కౌన్సెలింగ్‌కు హాజరైంది: 1,394
గైర్హాజరైంది: 7 మంది

చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

● ఆర్ డి బెస్ట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడులకు సోమవారం నుంచి 1,394 మంది కొత్త టీచర్లు రానున్నారు. మెగా డీఎస్సీ-2025 కింద ఎంపికైన వీరిని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నియమించారు. 2018లో టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లలో డీఎస్సీ మాటే ఎత్తలేదు. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. ఆ ప్రకారం కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,403 మంది ఎంపికయ్యారు. వీరికి సెప్టెంబరు 25న విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నియామక పత్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటికి 1394 మంది అభ్యర్థులు హాజరుకాగా.. శిక్షణలో చివరి రెండు రోజులైన గురు, శుక్రవారాల్లో స్థానాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయ్యాయి. కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన బడుల్లో సోమవారం కొత్త టీచర్లు చేరనున్నారు. కాగా, వివిధ కారణాలతో శిక్షణకు గైర్హాజరైన ఏడుగురికి త్వరలో విజయవాడలో శిక్షణ ఇచ్చి.. కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించనున్నారు.

ఇవి వెంట తీసుకెళ్లాలి

కొత్త టీచర్లు కౌన్సెలింగ్ ప్రొసీడింగ్స్ కాపీలు మూడు తీసుకెళ్లాలి. ఒకటివారు పనిచేయనున్న స్కూలుకు, మరొకటి ఎంఈవో కార్యాలయానికి, చివరిది తన వ్యక్తిగత ఫైల్‌లో ఉంచుకోవాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎంపికైన టీచర్లు

నియోజకవర్గం	మొత్తం ఖాళీలు	డీఎస్సీ ద్వారా భర్తీ
చంద్రగిరి	28	14
చిత్తూరు	94	45
జీడీ నెల్లూరు	58	30
కుప్పం	887	579
మదనపల్లె	96	29
నగరి	52	15
పలమనేరు	456	284
పీలేరు	72	42
పుంగనూరు	114	48
పూతలపట్టు	68	39
సత్యవేడు	107	66
శ్రీకాళహస్తి	64	32
తంబళ్లపల్లె	178	116
తిరుపతి	89	55
మొత్తం	2363	1394



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

బాలాజీ రైల్వే డివిజన్‌కోసం ముందడుగు

సాధన కోసం తిరుపతిలో ఏకమైన రాజకీయ, ప్రజాసంఘాలు

తిరుపతి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1990లో పురుడు పోసుకున్న బాలాజీ రైల్వే డివిజన్ నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీని సాధన కోసం తిరుపతిలోని రాజకీయ, ప్రజా సంఘాలు ఏకమయ్యాయి. ఉద్యమం ద్వారానైనా సాధించేందుకు ముందడుగు వేశాయి. ఇందులో భాగంగా ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. రైల్వే డివిజన్ సాధనకోసం చేసిన ప్రయత్నాలు, వచ్చినట్టే వచ్చి గుంటూరుకు వెళ్లిపోవడం, డివిజన్ రావడంలో ప్రయోజనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ వివరించారు. 'బాలాజీ డివిజన్ రాకపోవడానికి రాజకీయ పరిణామాలే కారణం. ప్రాంతీయ అసమానతలను పురికొల్పేలా కాకుండా రాయలసీమకు న్యాయం చేయాలి. 35 ఏళ్ల కలను సాకారం చేసుకునే దిశగా బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి పోరాటం సాగిస్తుంది. తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు మా హక్కు అన్న 'సీమ' ప్రజల నినాదాన్ని ముందుకు తీసుకెళ్దాం. కేంద్ర ప్రభుత్వాన్ని ట్యాగ్ చేస్తూ ట్విట్టర్ ద్వారా డిమాండును తెలియజేద్దాం' అని గిరిధర్ తెలిపారు. డివిజన్ ఏర్పాటుకు వనరుల ఇబ్బంది లేదని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు తెలిపారు. గుంతకల్లు డివిజన్లోని పాత ఇనుము అమ్మితే రూ.20 వేల కోట్లు వస్తుందని, అమరరాజ ఫ్యాక్టరీ అవతల స్థలమూ ఉందన్నారు. తిరుపతికి వచ్చే ప్రయాణికులకు సదుపాయాలు, పర్యాటకంగా మరింత అభివృద్ధి రైల్వే డివిజన్‌తోనే సాధ్యమవుతుందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిలో రైల్వే డివిజన్ కీలక పాత్ర పోషిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. బాలాజీ రైల్వే డివిజన్ కావాలన్న ప్రజల బలమైన ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తెలిపారు. ఈ ఉద్యమానికి ఎంపీల సహకారం తీసుకోవాలని బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి సూచించారు. పార్లమెంటులో తమ పార్టీ ఎంపీలతో బాలాజీ డివిజన్ డిమాండ్‌ను లేవనెత్తిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కందారపు మురళి చెప్పారు. అంతకుముందు రైల్వే స్టేషన్ నుంచి ఆటో, జీప్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు 'మనందరి విజన్- రైల్వే డివిజన్' బ్యానర్ పట్టుకుని నినాదాలతో ర్యాలీగా కచ్చపి ఆడిటోరియానికి వచ్చారు. ఈ సమావేశంలో టీటీడీ మాజీ డిప్యూటీ ఏవో చిన్నంగారి రమణ, సామాజికవేత్త పీసీ రాయల్, బీఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆకుల సతీష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.చౌదరి, న్యాయవాది దినకర్, శ్రీకాళహస్తి బోర్డు మాజీ సభ్యుడు మహీధర రెడ్డి, పోస్టల్ యూనియన్ నాయకులు శ్రీధర్ బాబు, ఫిల్మ్‌సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ నేత ఆముదాల తులసీరాం, ఐటీ నిపుణులు, పోస్టల్, ఆర్టీసీ, ఉపాధ్యాయ, విద్యార్థి, మర్చంట్ అసోసియేషన్ల నాయకులు, ఎస్వీయూ ప్రొఫెసర్లు, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వేదికగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గతంలో సమర్పించిన అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చునని పేర్కొన్నారు. అదేవిధంగా సంబంధిత వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవచ్చునని వివరించారు. ప్రజలు అర్జీలను అందజేసి, రసీదులు తీసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారమైతే మొబైల్‌కు సమాచారం వస్తుందని తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపునకు ఆదేశాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆలయం పేరుతో ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'తిరుపతిలో రెవెన్యూ దేవస్థానం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆర్డీవో రామ్మోహన్ స్పందించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని అర్బన్ తహసీల్దారు సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కొన్ని కట్టడాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఈ నిర్మాణాలు ఇబ్బందిగా ఉండటంతో గతంలో ఆందోళనలు సైతం చేపట్టారు.

స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్..!

● పద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపు రద్దుకు నిర్ణయం
● లాభాపేక్ష లేకుండా సొంతంగా నిర్వహించేందుకు కసరత్తు



స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడనుంది. లాభాపేక్ష లేకుండా సొంతంగానే మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ నిర్ణయం తీసుకోనుంది. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందుల పెత్తనం స్విమ్స్‌లో చాపకింద నీరులా పాకింది. శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో షాపును దక్కించుకుని లక్షలాది రూపాయలు ఆర్జించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా సదరు షాపునకు టెండరు జరిగినప్పటికీ మాఫియా ఉచ్చులో నుంచి బయటకు రాలేకపోయింది. ఈ పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' పలుసార్లు కథనాలను ప్రచురించింది. ఈ క్రమంలో షాపును రద్దు చేసేందుకు టీటీడీ సిద్ధమైంది.

మాఫియాకు షాక్ : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జన ఔషధి మెడికల్ షాపుల పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరో మెడికల్ షాపులు నామమాత్రపు అద్దెకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. వాటిని రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. స్విమ్స్ ఓపీల వద్ద ఉండే షాపును రద్దుచేయగలిగారు గాని పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. టీటీడీ మూడుసార్లు టెండర్లు పిలిచింది. అసాధారణ నిబంధనలు పెట్టడం వలన టెండరులో పాల్గొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తిచూపలేదు. తాజాగా ఆగస్టులో నాలుగోసారి టెండరు పిలిచారు. ఇందులో ఎక్కువ ధరకు కోట్ చేసిన ఇన్నోవేటివ్ ఫార్మా అధిక బిడ్డర్‌గా అర్హత సాధించింది. అయితే టెండరు జరిగి నెలరోజులు దాటినా అధిక బిడ్డర్‌కు కేటాయించకుండా మాఫియా అడ్డుకుంది. ఈ నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ నిర్ణయం అమల్లోకి వస్తే మాఫియాకు చెక్ పడినట్టేనని చెప్పుకోవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పోలెండ్ అమ్మాయి.. శేషాపురం అబ్బాయి



చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమకు ఎల్లలు ఉండవని నిరూపించారు చంద్రగిరి మండలానికి చెందిన యువకుడు, పోలెండ్ దేశానికి చెందిన ఓ అమ్మాయి. వీరిద్దరూ ప్రేమించుకుని ఒక్కటయ్యారు. చంద్రగిరి మండలం శేషాపురం గ్రామానికి చెందిన కనుమూరి మురళీధర్ నాయుడు, దేవకి దంపతుల కుమారుడు దేవ శివసాయి మురారీ జర్మనీలోని ఓ మెడికల్ కంపెనీలో ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేస్తున్న పోలెండ్ దేశానికి చెందిన యావ్ గోర్జాత్‌ని ప్రేమించాడు. తమ ప్రేమ విషయాన్ని వీరిద్దరూ తల్లిదండ్రులకు వివరించారు. వారు సరే అన్నారు. కాశిపెంట్ల వద్ద ఏజేపీ రిసార్ట్స్‌లో శనివారం రాత్రి వీరి వివాహం జరిగింది.

అయినా డ్రోన్ పట్టేసింది

● పాడుబడ్డ భవనంలో 'మత్తు' తీసుకుంటున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చుట్టూ ఎవరూ లేరనుకున్నారు. తమను ఎవరూ గమనించలేదనుకున్నారు. అలా పాడుబడ్డ బంగ్లాలోకి వెళ్లిన ఇద్దరు యువకులు మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్నారు. మత్తులో తేలిపోతున్న ఆ యువకులను పోలీసు డ్రోన్ పట్టేసింది. డ్రోన్ కెమెరా ద్వారా ఆ దృశ్యాలను చూసిన కమాండ్ కంట్రోల్‌లోని సిబ్బంది సమాచారంతో తిరుపతి వెస్ట్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్న ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. ఈ ఘటన ఆదివారం తిరుపతి ఇరిగేషన్ కార్యాలయం వెనుకవున్న పాడుబడ్డ బంగ్లాలో చోటుచేసుకుంది. లీలామహల్‌కు చెందిన పవన్, శ్రీనగర్‌కు చెందిన కుమార్ మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాలు తీసుకుంటుండగా డ్రోన్ కెమెరాతో గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పవన్ తిరుపతిలోని కొన్ని ప్రాంతాల్లో వాటర్ క్యాన్లు సరఫరా చేస్తున్నాడు. ఇతడి స్నేహితుడు కుమార్ డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. వీరి నుంచి రెండు మత్తు ఇంజెక్షన్లు, డ్రగ్స్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారిని వైద్య పరీక్షల నిమిత్తం రుయాకు తరలించారు. తిరుపతిలో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించడంలో డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. కాగా, ఆ ఇద్దరు యువకులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ చెప్పారు. వీరిని సోమవారం అర్బన్ తహసిల్దార్ ఎదుట హాజరుపరస్తామన్నారు. తమ పరిధిలో ఎక్కడైనా గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటున్న యువకులు

డ్రోన్ ఎగురుతూ ఉంటుంది

శివారు ప్రాంతాలు, పాడుబడిన భవనాల వద్ద ఎవరూ చూడరనే ఉద్దేశ్యంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బుక్ అయిపోతారు. ఎందుకంటే అలాంటి చోట్ల పోలీసు డ్రోన్.. ఆకాశాన తిరుగుతూ, కెమెరాలతో నిఘా పెట్టి ఉంటుంది. భవిష్యత్తులో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట వంటి ప్రాంతాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, హాస్టళ్ల వద్ద డ్రోన్లతో పర్యవేక్షణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

చంద్రగిరి

నయన మనోహరం నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవులను పురస్కరించుకుని ఆదివారం ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ముగ్ధ మనోహరంగా సాగాయి. బెంగళూరుకు చెందిన నాట్యధార నిర్వాహకురాలు కృతిక ఆధ్వర్యంలో కళాకారులు పూజిత, ఎస్.భట్, నవ్య సుదీంద్ర, నవీన్, గౌతమ్, మానస తదితరులు పుష్పాంజలి, ఇంద్ర, నరసింహకౌత్వం, గజవదన, మహాదేవ శివ శంబో, వెంకటరమణే, మాతే మలయాద్ వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. వీరికి శిల్పారామం ఏవో సుధాకర్ జ్ఞాపికలు అందజేశారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు చతుష్టార్చన, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం సీతారామ సమేత లక్ష్మణస్వామివారి ఉత్సవమూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం పవిత్ర హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరిబాబు పాల్గొన్నారు.

కిలోమీటరుకు 20 స్పీడ్‌బ్రేకర్లా!

● వాహన చోదకుల ఇబ్బందులు



ఆర్‌సీపురం వద్ద స్పీడ్ బ్రేకర్లు

రామచంద్రాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పూడి-పుత్తూరు మార్గంలో రామచంద్రాపురం నెన్నూరు వరకు పరిధికి మించి స్పీడ్‌బ్రేకర్లు ఉండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌సీపురం, నడవలూరు, నడవలూరు దళితవాడ, ఐపైవై క్వార్టర్స్, నెన్నూరు, నెన్నూరు దళితవాడ వద్ద ఆరు చొప్పున స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఏటవాలుగా కాకుండా ఒక్కోచోట మూడేసి చొప్పున ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహన చోదకులు అదుపు తప్పి పడుతూ గాయపడుతున్న వైనాలు నిత్యం జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం భార్యభర్తలు గాయాలపాలయ్యారు. వేగ నిరోధకాలను తగ్గించాలని కోరుతున్నారు.

పెరటాసి ప్రభావంతో భక్తుల తాకిడి



సేద తీరుతున్న తమిళ భక్తులు

రామచంద్రాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పెరటాసి నెల సందర్భంగా ఆదివారం 500మంది తమిళ భక్తులు కాలి నడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. షోలింగర్, షెంగీ, ఆర్‌కేతోట ప్రాంతాల నుంచి ఈ నెల 8న బయలుదేరిన వీరు ఆదివారం రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయం వద్ద ఆగారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం బయలుదేరి తిరుమలకు వెళ్లారు.

కొత్త ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన పొందిన కొత్త ఉపాధ్యాయులు

చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో ఇటీవల డీఎస్సీకి ఎంపికైన 8 మంది ఉపాధ్యాయులను గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. పాతపేటకు చెందిన రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు అరిగిల రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీ.లిషానందిని, దళవాయి సూర్య, బొజ్జా సుమలత, కె.డిలీప్ కుమార్, దళవాయి సురేంద్ర, ఆవుల కల్యాణి, అరిగెల బానుప్రకాష్, డి.మహేష్‌లకు శాలువా కప్పి, మెమెంటో, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా అరిగిల రామచంద్రయ్య మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఎనిమిది మంది ఉపాధ్యాయ వృతికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆవుల క్రిష్ణయ్య, గేనే సుబ్బయ్య, జూ పార్క్ మాజీ డైరెక్టర్ మణియాదవ్, అరిగిల కృష్ణ, బీమరాజు, స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పాకాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు డిమండు చేశారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.. 12వ పీఆర్సీ వెంటనే నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, నాయకులు రాజేంద్రుడు, గోపాలయ్య, ఆదికేశవులు, కృష్ణమూర్తి,జయబాల, కెఎన్ తులసీరామ్, రెడ్డప్ప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో ఉమామహేశ్వర నాయుడు,నేతలు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి); మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర నాయుడు జన్మ దినం సందర్భంగా ఆదివారం మండల పార్టీ శ్రేణులు బోడేవాండ్లపల్లె శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఉమామహేశ్వరనాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీనేతలు బండి చిన్నపరెడ్డి, అలుగంటి నిరంజన్, రఘునాథ, శిరివేలు రమేష్, హరిశ్చంద్ర, రాజు, గోపాల్ ,రాజన్న,రాయపాటి బాలు, అశోక్ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు,పవన్ ,పురుషోత్తం, విజయరెడ్డి, జయపాల్ రెడ్డి,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ బోర్డు సభ్యురాలికి సత్కారం



పద్మలత కనకరాజన్‌ను సన్మానిస్తున్న మొదలియార్ నాయకులు

పాకాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమితులైన పద్మలత కనకరాజన్‌ను మండలం మొదలియార్ సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. మండల మొదలియార్ సంఘం అధ్యక్షుడు ఎస్ దేవగురునాథన్, ఉపాధ్యక్షుడు కనకరాజన్, కార్యదర్శి ఎన్. నీలకంఠన్, సహ కార్యదర్శి ఎస్.శరవణ, ట్రెజరర్ ఆర్.సంతోష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 84,571 మంది భక్తులు దర్శించుకున్నారు. 36,711 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

ప్రసాదాల తయారీకి గ్రైండర్ వితరణ



తిరుచానూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయానికి విశాఖపట్నానికి ఓ భక్తుడు. లడ్డూ ప్రసాదాల తయారీకి గ్రైండర్‌ను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వాత్సవ కుటుంబాన్ని పరామర్శిస్తున్న దివాకర్‌రెడ్డి

చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి గరుడ వారధిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కొమ్మినేని వాత్సవ కుటుంబ సభ్యులను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి పరామర్శించారు. ఈ ప్రమాదంలో చంద్రగిరి మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. కొటాలకు చెందిన వాత్సవ మృతుల్లో ఒకరు. ఇతని కుటుంబ సభ్యులను దివాకర్‌రెడ్డిపరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ నాయకులుపాల్గొన్నారు.

పిల్లలకు ఆనందం పంచిన 'ప్రేరణ'



రేణిగుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి రాస్‌లో ఆదివారం ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్ ఉత్సాహంగా సాగింది. దివ్యాంగ పిల్లలకు క్రీడా పరికరాలు అందించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ఆటలాడి ఆనందాన్ని పంచారు. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ కోశాధికారి తరుణ్, సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఉత్తరాఖండ్ ఐఏఎస్ అధికారులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం ఉత్తరాఖండ్ చీఫ్ సెక్రటరీ ఆనంద్‌బర్ధన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ ఎస్ రావత్ దర్శించు కున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శ నానంతరం వేద పండితులు వారిని ఆశీర్వ దించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసా దాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామంలో ఉరివేసుకొని కిష్టయ్య(44) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన కిష్టయ్య ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఏపీపీఆర్ఎంఈ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన సభ్యులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీపీఆర్ఎంఈ) ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా శశిధర్, ప్రధాన కార్యదర్శిగా చెంచురత్నం యాదవ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లుగా లక్ష్మీపతియాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రపాణి, త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులుగా మూర్తి, వాణి, లోకేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా అలీ, లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కొత్తగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

25న పెద్ద శేషుడిపై మలయప్ప దర్శనం

తిరుమల, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా ఈనెల 25న శ్రీవారు పెద్ద శేషవాహనంపై దర్శనమివ్వనున్నారు. ఆరోజున రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఉభయదేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరి ఊరేగనున్నన్నారు. వాహనసేవ నిర్వహణకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది.

ముందుకు కదలని మురుగు



ఆర్‌ఎస్‌ఆర్ నగర్‌లో ఖాళీస్థలంలో మురుగునీరు



ఎన్టీఆర్‌కాలనీలో నిలిచిన మురుగునీరు

తిరుపతిరూరల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): పేరూరు పంచాయతీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీఆర్ కాలనీ, ఆర్‌ఎస్‌ఆర్ నగర్‌లలో మురుగు నీరు ముందుకు పారేందుకు అవుట్‌లెట్ లేదు. దీంతో ఖాళీ స్థలంలో ముళ్లచెట్ల మధ్యలో మురుగు నిల్వచేరుతోంది. ఎన్టీఆర్ కాలనీ నుంచి కలుజు కాలువ మీదుగా పారుతున్న మురుగు నీరు నేరుగా ఆర్‌ఎస్‌ఆర్ నగర్‌లోని ఖాళీ పాట్లలోకి చేరుతోంది. కాలనీలో దాదాపు రెండుకిలోమీటర్ల వరకు డ్రెయిన్లు లేకపోవడంతో పేరుకుపోతోంది. దీంతో కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు హరిపురంకాలనీలోని కాలువలో కలిసేలా కాలువలు ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు.

కార్డన్‌సెర్చ్‌లో దొరికిన పాత నిందితుడు



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ప్రసాద్

తిరుచానూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు నెలవైందని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దామినేడు హౌసింగ్ కాలనీలో పోలీసులు ఆదివారం వేకువజామున కార్డన్ సెర్చ్ చేశారు. డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు ప్రతి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఎంతో కాలంగా దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న గణేష్‌ను పట్టుకున్నారు. రికార్డులు లేని 17 ద్విచక్ర వాహనాలు, 13 ఆటోలు, ఓ కారును సీఐ సునీల్‌కుమార్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు జగన్నాథరెడ్డి, అరుణ, పోలీసులు ఉన్నారు.

భక్తజన సంద్రం...ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది.వారాంతపు సెలవులతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 511 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,770, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 316మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,904 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,272, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 294మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 233మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 75మంది భక్తులు పూజలు చే యిం చుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,565 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీవారిమెట్టు వద్ద భక్తుల ఆందోళన



శ్రీవారిమెట్టు వద్ద నిలిచిపోయిన భక్తులు

చంద్రగిరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): టోకెన్ల జారీకి సంబంధించి సమాచార లోపంతో శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో వివాదాలు కూడా జరుగుతున్నాయి. సాధారణంగా శ్రీవారిమెట్టు వద్ద ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు ఇచ్చేవారు. ఇక్కడ ప్రైవేటు వాహనాలు, ఆటో వాలాలు భక్తులను మోసం చేస్తున్నారనే ఉద్దేశంతో టోకెన్లు పంపిణీని అలిపిరికి మార్చారు. అక్కడ సమయ పాలన లేకుండా టోకెన్లు జారీ చేస్తున్నారనే విమర్శలుంటున్నాయి. భక్తులు ఆదరాబాదరాగా టోకెన్లు తీసుకుని శ్రీవారిమెట్టుకు వస్తున్నారు. ఇక్కడ టీటీడీ సిబ్బంది ఏ రోజుకు టోకెన్లు ఇస్తారో అదే రోజు వస్తేనే అనుమతిస్తామంటున్నారు. లేకుంటే 1200 మెట్టు వద్ద అవి స్కాన్ కావని, దర్శనం ఉండదని చెబుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు కొందరు భక్తులు పిల్లాపాపలతో చేరుకున్నారు. తమను అనుమతించకపోవడంతో భక్తులు వాగ్వాదానికి దిగారు. మధ్యాహ్నం 2 గంటలపైన ఐదేళ్ల లోపు పిల్లలను అనుమతించాలంటూ వారు ఆందోళనకు దిగారు. టీటీడీ సిబ్బంది సర్ది చెప్పి వారిని శ్రీవారి ఉచిత బస్సులో తిరుపతికి పంపించారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతిరూరల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో నకిలీ కుల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గూగుల్‌మీట్ ద్వారా రాష్ట్రకార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ ఎస్టీటీ ఉద్యోగాల్లో షేక్, సయ్యద్ వంటి ఉన్నతకులాలకు చెందిన కొందరు బీసీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందరాని ఆరోపించారు. బీసీ-డీలో ఎలాంటి ముస్లిం కులాలు లేకున్నా ఉద్యోగాలు పొందడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

వడమాలపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారిలో అంజేరమ్మ కనుమ వద్ద ఆదివారం లారీ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన నవనీత తన అల్లుడు శంకర్‌తో కలసి బైక్‌పై రేణిగుంటకు వెళ్తుండగా అంజేరమ్మ కనుమ వద్ద చెన్నై నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో నవనీత చెయ్యి లారీ వెనుక చక్రం కింద పడి నలిగిపోయింది. తీవ్రంగా గాయపడిన నవనీత, శంకర్ చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



పెళ్లకూరు, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మండలంలోని అక్కగారిపేట వద్ద 71వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని హైవే అంబులన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ నాగరాజు చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 9440796358 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అపాచీ కార్మికుడి దుర్మరణం



మృతి చెందిన ప్రసన్న కుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడు ఉందారపు ప్రసన్న కుమార్(37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వరదయ్యపాలెం మండల రాచర్ల గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ తడ మండలం కాదలూరుకి చెందిన మౌనికతో వివాహమైంది. ఏడాది నుంచి అపాచీ కంపెనీలో పని చేస్తూ కాదలూరులో నివాసం ఉంటున్నాడు. శనివారం కంపెనీలో విధులు ముగించుకుని సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి కాదలూరుకు వెళ్తుండగా జాతీయ రహదారిపై డంపింగ్ యార్డు వద్ద శుద్ధి చేసిన చెత్తను తీసుకుస్తున్న టిప్పర్ ఢీకొంది. తలకు బలమైన గాయమై రక్తస్రావం జరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన ప్రసన్న కుమార్‌ను స్థానికులు గుర్తించి హైవే అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై ఆగని 'గజ'దాడులు



కొత్తూరు వద్ద ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సుబ్బరాజు

సోమల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కొత్తూరు, పత్రపల్లె రైతుల పొలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి కొత్తూరుకు చెందిన ఎస్.గోవిందరెడ్డి, నాగిరెడ్డి, రమణారెడ్డికి చెందిన వరి పంటను ఐదు ఏనుగులు ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. పలు మామిడి తోటల్లో తిరగాడి కొమ్మలను విరిచేశాయి. ఆదివారం డీఎఫ్‌వో సుబ్బరాజు, పుంగనూరు ఎఫ్ఆర్‌వో శ్రీరాములు.. రైతులతో కలసి ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. నష్టపరిహారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులకు పలు సూచనలిచ్చారు. తెల్లని దుస్తులు ధరించి ఏనుగుల కంట పడొద్దని హెచ్చరించారు. ఆవులపల్లె, పెద్ద ఉప్పరపల్లె, చారాల అటవీఅధికారులు ఇంద్రాణి, సురేంద్ర, బాలసుబ్రహ్మణ్యం, రామచంద్ర, బీట్ సిబ్బంది, సర్పంచు కోదండరాజు, మాజీ సర్పంచు రెడ్డెమ్మ, టీడీపీ నాయకుడు వేణునాయుడు పాల్గొన్నారు.

దాతలారా.. నా బిడ్డను కాపాడండి

ఓ బాలుడి తల్లి వేడుకోలు



బాధితుడు వెంకటేష్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'దాతలారా.. నా బిడ్డను కాపాడండి' అని ఓ బాలుడి తల్లి వేడుకుంటోంది. గంగాధరనెల్లూరు మండలం తూగుంద్రం పంచాయతీ బాలయ్యకొత్తూరు గ్రామానికి చెందిన నీతూ ఆదివారం మీడియాకు వివరాలు తెలిపింది. నీతూకు నరసింహారెడ్డితో 12 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి వెంకటేష్ (10), చంద్రిక (7) పిల్లలున్నారు. వెంకటేష్ ఏడాది కిందటి వరకు కూడా చలాకీగా ఉండేవాడు. చెల్లెలితో కలిసి తూగుంద్రం ప్రాథమిక పాఠశాలలో చదువుకునేవాడు. ఓ రోజున తిన్న ఆహారం జీర్ణంకాకపోవడం, అప్పుడప్పుడు జ్వరం వస్తుండటంతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. గ్యాస్ట్రిక్ సమస్య అని, మందులు ఇచ్చారు. రెండు నెలల తర్వాత కడుపు పెద్దదై.. ఉబ్బరంగా మారడం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, దగ్గినప్పుడు రక్తం పడటంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి.. లివర్ సమస్య వల్లే ఇలా జరుగుతోందని గుర్తించారు. లివర్ మార్పిడి చేయాలని చెప్పారు. పైగా వెంటనే ఆపరేషన్ చేయాలనడంతో తల్లి తన లివర్ ఇవ్వడానికి సిద్ధమైంది. అయితే ఆపరేషన్‌కు సుమారు రూ.20లక్షలకుపైగా ఖర్చవుతుందని తెలిపారు. అంత డబ్బు తమ వద్ద లేదని, ఇప్పటికే రూ.8లక్షల వరకు అప్పులు చేశామని ఆ తల్లి కన్నీరు పెట్టుకుంది. ఇటీవల తూగుంద్రం పంచాయతీకి చెందిన టీడీపీ నేతల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వవిప్ థామస్‌ను కలిసి సమస్యను తెలియజేశామని చెప్పింది. ఆయన స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ థామస్‌తోపాటు మనసున్న దాతలు తమ కుమారుడి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేయాలనుకునేవారు ఎ.నీతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, తూగుంద్రం బ్రాంచ్, అకౌంట్ నెంబర్ 64231000995 1242, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నెంబర్: యూబీఐఎన్0సీజీ7999, లేదంటే ఫోన్ పేనెంబర్ 93982 26262కు నగదు పంపించవచ్చని వేడుకున్నారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం స.హ చట్టం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజారెడ్డి, శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రమని జిల్లా వినియోగదారుల సమాచార సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జాతీయ సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వినియోగదారులకు అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కుచట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, జిల్లా సమాచార హక్కు ఐక్యవేదిక ప్రతినిధులు మునిచంద్రారెడ్డి, చంద్రశేఖర్, దేవేంద్ర, సుధాకర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం



5కే వాక్‌థాన్‌లో ఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అమర ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గొరినేని ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డోన్ట్ మిస్ ఏ బీట్ అనే నినాదంతో అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు ఆదివారం 5కే వాక్‌థాన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసాద్, రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె వ్యాధులు వస్తున్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర ఆస్పత్రి వైద్యులు వెంకటశివకృష్ణ, వెంకటేష్, నౌషాద్, ఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంగీతరావు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు, గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు కోరారు. ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు సైనికుల్లా పనిచేశారని, అయితే వారిపై కేసులు నమోదు చేయడం బాధాకరమని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ఆ కేసులను ఎత్తివేయాలన్నారు. ఖాళీగా ఉన్న 519 సెక్షన్ ఆఫీసర్ల పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులలో 30శాతం పంచాయతీరాజ్ ఇంజనీర్లకు కేటాయించాలన్నారు. జేఈల పనిభారం తగ్గించాలని కోరారు. వివిధ జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయం

● శ్రీచైతన్య చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీలక్ష్మి

తిరుపతి(విద్య), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయంగా పనిచేయాలని శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీలక్ష్మి సిబ్బందికి సూచించారు. విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బందితో ఆదివారం ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ.. మేము అనే భావనతో ప్రతి ఒక్కరూ పనిచేసినపుడు అనుకున్న ప్రగతిని సాధిగలమని, ఆ విషయాన్ని శ్రీచైతన్య రుజువు చేసిందని అన్నారు. చిన్న సంస్థగా ప్రారంభమై ఆసియాలోని అతిపెద్ద విద్యాసంస్థగా ఎదిగిన విధానాన్ని వివరించారు. మన విద్యాసంస్థలలో చదువుతున్న ప్రతి విద్యార్థి కల సాకారం చెయ్యడం కోసం ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిరంతరం ప్రయత్నించాలని కోరారు. శ్రీచైతన్య కళాశాలల ఏజీఎం బీవీ ప్రసాద్, పాఠశాలల ఏజీఎం సురేష్, కళాశాలల డీన్‌లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగంధం స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్‌ను చూపుతున్న అటవీ శాఖ అధికారులు

మంగళం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుమల జపాలి అటవీ ప్రాంతంలో ఆదివారం అటవీశాఖ అధికారులు శ్రీగంధం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. మూడు మెట్లు(వేరు భాగాలు) స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి అటవీ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి తిరుమల జపాలి పైభాగంలోని అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. 9 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి శ్రీగంధం చెట్లను నరుకుతూ కనిపించాడు. చుట్టుముట్టి పట్టుకున్నారు. అతను చంద్రగిరి మండలం పాండురంగవారిపల్లెకు చెందిన జె.రాజశేఖర్‌గా గుర్తించారు. మూడు శ్రీగంధం మెట్లు(వేరు భాగాలు), రంపాలు స్వాధీనం చేసుకున్నారు. 32 కేజీల బరువు ఉన్న శ్రీగంధం మెట్ల విలువ రూ.లక్ష ఉంటుందని అటవీ శాఖ క్షేత్రాధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో తిరుమల బీట్ ఎఫ్‌బీవో అఖిల్, పాపవినాశనం బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు సీఐటీయూ జిల్లా మహాసభలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని వీఎస్ఎన్ కల్యాణ మండపంలో సోమ, మంగళవారాల్లో సీఐటీయూ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 2 గంటలకు పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా కల్యాణ మండపం వరకు ర్యాలీ ఉంటుందని వివరించారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు సీహెచ్ నరసింగరావు, అజేయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

బాణసంచా పట్టివేత అభినందనీయం

● క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా రవాణా చేస్తున్న బాణసంచాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రెండు రోజుల క్రితం రూ.లక్షల విలువైన టపాకాయలను తిరుపతి పోలీసులు పట్టుకోవడం అభినందనీయమని తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అక్రమ బాణసంచాను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే సొసైటీ పేరుతో టీటీడీ ఉద్యోగులకు టపాకాయలను విక్రయించాలని, ఆ పేరుతో కొందరు వ్యాపారం చేస్తుండటం సమంజసం కాదని అన్నారు.

భర్తల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి



మాట్లాడుతున్న బాలాజీరెడ్డి, మునిబాబు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భార్యల నుంచి భర్తలకు రక్షణ కల్పించడంతోపాటు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని భార్యా బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బాలాజీరెడ్డి అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు సహజమని తెలిపారు. భర్తపై భార్య కేసు పెడితే చట్టాలు చాలా కఠినంగా అమలవుతున్నా యని పేర్కొన్నారు. అదే తరహాలో భర్తలు పెట్టే కేసుల విషయంలోనూ చట్టాలు కఠినంగా ఉండాలని కోరారు. లీగల్ అడ్వైజర్ మునిబాబు మాట్లాడుతూ ఆడవారికి తాము వ్యతిరేకం కాదని, కొందరు భర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి వారికోసం తాము ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకళారెడ్డి, బాధితులు దాసు, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మెడికల్ కిట్ల పంపిణీ



వృద్ధులతో లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి నేతలు

తిరుపతి(విద్య), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో అలిపిరి సమీపంలోని శ్రీపద్మావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ రీజియన్ చైర్మన్ లైన్ మక్కిన భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులకు కిట్లు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు ఉపయోగపడే మెడికల్ కిట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లయన్ చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తమ నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు రామచంద్రా రెడ్డి, బాబురావు, వృద్ధాశ్రమ నిర్వాహకులు డాక్టర్ బి.మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్రయాణికులు ఫుల్..పర్యవేక్షణ నిల్

అస్తవ్యస్తంగా సెంట్రల్ బస్టాండు నిర్వహణ





కాణిపాకం ప్లాట్‌ఫామ్‌లో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు, శ్రీకాళహస్తి ప్లాట్‌ఫామ్ వద్ద అల్ట్రాడీలక్స్ ఎక్కకుండా వేచివున్న మహిళలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండుకు ప్రయాణికుల తాకిడి పెరిగింది. అందుకను గుణంగా అధికారుల పర్యవేక్షణ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీకాళహస్తి, వెంకటగిరి, కాణిపాకం, పీలేరు, మదనపల్లెలకు రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయడం లేదు. తద్వారా ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పల్లె వెలుగు బస్టాండులోనూ ఇదే పరిస్థితి ఉంటోంది. బస్సులు వచ్చిన సమయంలో తోసుకుంటూ, వెనుక పరుగెడుతూ ఎక్కుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో రద్దీ సమయాల్లో అధికారులు దగ్గరుండి సూచనలు, సలహాలు ఇస్తూ అదనపు బస్సులు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

విచ్చలవిడిగా పార్కింగ్

బస్టాండు లోపల బస్సులు విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో ఒక బస్సు బయటకు వెళ్లడానికి అరగంటకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటోంది. ఉదయం 8నుంచి 10.30గంటల వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల మధ్య ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. పరిస్థితిని చక్కబెట్టడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమస్య గత రెండు నెలల్లో అధికమైంది.

దుకాణాలపై పర్యవేక్షణేది?

బస్టాండులోని దుకాణాలపైనా పర్యవేక్షణ లోపించింది. టెండర్ దక్కించుకున్న వ్యక్తులు కాకుండా ఇతరులు వ్యాపారాలు చేస్తున్నారు. వారు నిబంధనలు పక్కనబెట్టి విక్రయాలు జరుపుతూ ప్రయాణికులను దోచుకుంటున్నారు. ఆదివారం ఉదయం శ్రీనివాస బస్టాండులోని 22వ దుకాణంలో హిందూపురానికి చెందిన బాలాజీప్రసాద్ నుంచి రూ.18విలువైన కూల్‌డ్రింక్‌కు రూ.30 వసూలు చేశాడు. 24వ దుకాణంలో కడపకు చెందిన ముగ్గురు పిల్లలకు రూ.20 విలువైన కూల్‌డ్రింక్‌ను రూ.25 విక్రయించారు. ఈ విషయమై సదరు ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు.

మరుగుదొడ్లలోనూ దోపిడీ

బస్టాండుకు మూడు వైపులున్న మరుగుదొడ్ల నిర్వాహకులు సైతం ప్రయాణికులను దోచేస్తున్నారు. ఆర్టీసీ నిర్ణయించిన ప్రకారం మూత్ర విసర్జనకు రూ.2, మల విసర్జనకు రూ.3 వసూలు చేయాలి. కానీ దేనికైనా రూ.20 వసూలు చేస్తున్నారు. అడిగిన డబ్బు ఇస్తేనే లోనికి పంపిస్తున్నారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదులు రావడంతో డీపీటీవో జగదీష్ కొన్ని రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అయినా వారి తీరులో మార్పు రాలేదు.

హోటళ్లలో నాణ్యతకు తిలోదకాలు

బస్టాండు లోపల హోటళ్లలో అందించే ఆహార పదార్థాల్లో నాణ్యత ఏ మాత్రమూ ఉండటం లేదన్న విమర్శలున్నాయి. కొన్ని రోజులుగా బస్టాండు భవనాల సీలింగ్ తొలగిస్తున్నారు. పక్కనే చెన్నై ప్లాట్‌ఫామ్ వద్ద ఉన్న హోటల్‌ను యథావిధిగా నడుపుతుండటంతో దుమ్ముధూళి పడి ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయి. మరో రెండు హోటళ్లలో ఒకవైపు ప్రయాణికులు తింటుండగానే మరోవైపు ఎలకలు తిరుగుతున్నాయి. శ్రీనివాస బస్టాండులో ఓ హోటల్ ఇరువైపులా దారులు ఏర్పాటుచేయడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బస్టాండు ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





బస్సుల రాకపోకల కారణంగా హోటల్ ముందున్న మెట్లపై వేచి ఉన్న ప్రయాణికులు, బిల్డింగ్ సీలింగ్ తొలగిస్తున్నా పక్కనే నడుస్తున్న హోటల్

సాహిత్యంతో ఉత్తమ విలువలు

గార్లపాటి పురస్కార ప్రదానోత్సవంలో రమేష్‌నాథ్



పురస్కారాలు అందుకున్న ముక్తేశ్వరరావు, గోవిందు, గంగాధర ప్రసాద్, మల్లేశ్వరరావు, దామోదర్ నాయుడు తదితరులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : సాహిత్యం సమాజంలో ఉత్తమ విలువలు నెలకొల్పడానికి మార్గదర్శకం వహిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల అన్నారు. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో ఆదివారం విశ్వ సాహితీ సంస ఆధ్వర్యంలో గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని, సాహితీ సేవా రంగంలో నిరంతరం కృషి చేస్తున్న రచయితలు, కవులు, పండితులను ఏటా సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సంస్థకు ఆయన రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు, ప్రముఖ నవలా రచయిత మురిసెట్టి గోవిందు, సీనియర్ పాత్రికేయులు, కవి, అనువాదకులు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఉపాధ్యాయులు, కవి సురేంద్ర రొడ్డ, విశ్రాంత ఆచార్యులు, సంఘ సేవకురాలు ఆచార్య కట్టమంచి మహాలక్ష్మ్మలకు గార్లపాటి పురస్కారాలను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఆదర్శ రైతులు ఏనుగు తారాపతి, దామా అయ్యప్ప నాయుడులకు ఏనుగు అంకమ నాయుడు సౌజన్యంతో రైతు పురస్కారాలను అందించారు. అనంతరం విశ్వ సాహితీ సంస్థ నిర్వాహకులు గార్లపాటి దామోదర నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సాహితీవేత్తలు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సుధాకర్ చౌదరి, శతావధాని ఆముదాల మురళి, రాస్ అధికారి నాగరాజు నాయుడు, పైనేని తులసీనాథం నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, మేమూరి జయరాం ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజు, వాకా ప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య రాజేశ్వరమ్మ, డాక్టర్ వి.కృష్ణవేణి, గంగవరపు శ్రీదేవి, తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ మౌని, ఆర్‌సీకేరాజు, డాక్టర్ పరమేశ్వరయ్య, డాక్టర్ మస్తానమ్మ, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జునలతోపాటు పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో గంజాయి బ్యాచ్ హల్‌చల్

ప్రయాణికులపై దౌర్జన్యం...దాడికి యత్నం - ప్రశ్నించిన ఆర్టీసీ కంట్రోలర్‌పైనా రుబాబు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో గంజాయి బ్యాచ్‌లు బరితెగిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి చెన్నై, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్లాట్‌ఫారాల వద్ద నలుగురు యువకులు గంజాయి పీలుస్తూ మత్తులో తూలుతున్నారు. బస్సుల కోసం వేచి ఉంటున్న వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఎదురుతిరిగిన వారిపై దాడికి దిగారు. దీంతో అక్కడున్న మహిళలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ కంట్రోలర్లు వారిని ప్రశ్నించారు. 'మీకు ఇక్కడేం పని' అంటూ నిలదీయడంతో వారిపైనా ఎదురుదాడికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని మందలించి పంపారు. ఇలాంటి ఘటనలు ఆర్టీసీ బస్టాండులో నిత్యకృత్యమయ్యాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసుస్టేషన్‌లో సిబ్బందిని ఏర్పాటు చేసి, ఇలాంటి బ్యాచ్‌లను నియంత్రించాలని కోరుతున్నారు.

రంజీ జట్టులో జిల్లా వాసులకు చోటు





అభిషేక్‌రెడ్డి సి.ఆర్.జ్ఞానేశ్వర్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రంజీ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరు క్రికెటర్లకు స్థానం లభించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన అభిషేక్‌రెడ్డి, సి.ఆర్.జ్ఞానేశ్వర్, దీపక్‌సాయినాథ్ రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారం రోజులుగా విజయనగరంలో జరిగిన రంజీ ప్రాబబుల్స్ మ్యాచ్‌ల్లో బ్యాటర్స్ అయిన అభిషేక్‌రెడ్డి, సి.ఆర్.జ్ఞానేశ్వర్ రాణించి సెలక్టర్లను ఆకర్షించారు. ఈ మేరకు ఏపీ తరఫున తిరుపతి జిల్లాకు చెందిన అభిషేక్‌రెడ్డిని 16మంది స్క్వాడ్ లెవెల్స్‌కు, జ్ఞానేశ్వర్‌ను స్టాండ్‌బైగా ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 15వ తేదీ నుంచి కాన్పూర్‌లో ప్రారంభం కానున్న రంజీ మ్యాచ్‌లో ప్రాతినిథ్యం వహించేందుకు అభిషేక్‌రెడ్డి ఆదివారం పయనమయ్యారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్‌కుమార్, శ్యాంసుందర్, ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం సేతన, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శరద్‌కుమార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. పండితులు ఆశీర్వదించారు.



జస్టిస్ ప్రవీణ్‌కుమార్



జస్టిస్ శ్యాంసుందర్



జస్టిస్ సేతన



జస్టిస్ శరద్‌కుమార్

కరకంబాడి వీఆర్వోపై దౌర్జన్యం..పోలీసులకు ఫిర్యాదు





వివాదాస్పద భూమిలో చేపట్టిన భవన నిర్మాణం - పనులను అడ్డుకుంటున్న వీఆర్వో రమేష్

రేణిగుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వీఆర్వోపై భవన నిర్మాణ కార్మికులతో దౌర్జన్యం చేయించారు. శ్రీకాళహస్తి రోడ్డులోని 65 ఎకరాల ప్రభుత్వ భూమిపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. అయితే ఈ స్థలాన్ని తూకివాకం లెక్కదాఖలా సర్వే నెంబరు చూపుతూ రిజిస్ట్రేషన్ చేసుకుని భవన నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు కరకంబాడి వీఆర్వో రమేష్‌పై దౌర్జన్యానికి దిగారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసుల సాయంతో నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ అనుమతులు ఉండటం వల్లే పనులు చేస్తున్నామని భవన యజమానులు చెబుతున్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

చిల్లకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చిల్లకూరు దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ఛైర్మన్‌గా దువ్వూరు దశరథరామిరెడ్డి, సభ్యులుగా ఆనిమెళ్ల సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, తూపిలి పద్మమ్మ, దువ్వూరు అనిత, అన్నం మునిశేఖర్‌గౌడ్, మేకల కమల, ఒబ్బాయి ఉమామహేశ్వరి, పొక్కలి శ్రీలక్ష్మి, సారంగం రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ పెంపొందించేందుకు, భక్తులకు ఎంటువంటి అసౌకర్యాలు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడి మృతి



మృతి చెందిన ప్రసన్న కుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడు ఉందారపు ప్రసన్న కుమార్(37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వరదయ్యపాలెం మండల రాచర్ల గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ తడ మండలం కాదలూరుకి చెందిన మౌనికతో వివాహమైంది. ఏడాది నుంచి అపాచీ కంపెనీలో పనిచేస్తూ కాదలూరులో నివాసం ఉంటున్నాడు. శనివారం కంపెనీలో విధులు ముగించుకుని సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి కాదలూరుకు వెళ్తుండగా జాతీయ రహదారిపై డంపింగ్ యార్డు వద్ద శుద్ధిచేసిన చెత్తను తీసుకుస్తున్న టిప్పర్ ఢీకొంది. తలకు బలమైన గాయమై రక్తస్రావం జరగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన ప్రసన్న కుమార్‌ను స్థానికులు గుర్తించి హైవే అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ శ్రేణులకు రక్షణ కవచం డిజిటల్ బుక్

డక్కిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బుక్ వైసీపీ శ్రేణులకు రక్షణ కవచం లాంటిదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్రీనివాసులురెడ్డి అన్నారు. డక్కిలిలో ఆదివారం వైసీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులపై అకారణంగా కేసులు పెడితే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటారని చెప్పారు.

మేరీ వృద్ధాశ్రమానికి చేయూత

నాయుడుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సంజాయ్ గాంధీ కాలనీలోని మేరీ వృద్ధాశ్రమానికి టీడీపీ నాయకులు ఆకుల మణి, లక్ష్మీపతి, ముత్యాలయ్య నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భర్త పార్థసారధి జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సునీతబెన్నీ, పురుషోత్తం, అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో గంజాయి బ్యాచ్ హల్‌చల్

ప్రయాణికులపై దౌర్జన్యం... దాడికి యత్నం

ప్రశ్నించిన ఆర్టీసీ కంట్రోలర్‌పైనా రుబాబు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో గంజాయి బ్యాచ్‌లు బరితెగిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి చెన్నై, శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్లాట్‌ఫారాల వద్ద నలుగురు యువకులు గంజాయి పీలుస్తూ మత్తులో తూలుతున్నారు. బస్సుల కోసం వేచి ఉంటున్న వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఎదురుతిరిగిన వారిపై దాడికి దిగారు. దీంతో అక్కడున్న మహిళలు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ కంట్రోలర్లు వారిని ప్రశ్నించారు. 'మీకు ఇక్కడేం పని' అంటూ నిలదీయడంతో వారిపైనా ఎదురుదాడికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని మందలించి పంపారు. ఇలాంటి ఘటనలు ఆర్టీసీ బస్టాండులో నిత్యకృత్యమయ్యాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసుస్టేషన్‌లో సిబ్బందిని ఏర్పాటు చేసి, ఇలాంటి బ్యాచ్‌లను నియంత్రించాలని కోరుతున్నారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం స.హ చట్టం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాజారెడ్డి, శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రమని జిల్లా వినియోగదారుల సమాచార సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జాతీయ సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వినియోగదారులకు అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కుచట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, జిల్లా సమాచార హక్కు ఐక్యవేదిక ప్రతినిధులు మునిచంద్రారెడ్డి, చంద్రశేఖర్, దేవేంద్ర, సుధాకర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరం



5కే వాక్‌థాన్‌లో ఐఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అమర ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా డోన్ట్ మిస్ ఏ బీట్ అనే నినాదంతో అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసి బస్టాండు కూడలి నుంచి తిమ్మినాయుడుపాళెం వరకు ఆదివారం 5కే వాక్‌థాన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రసాద్, రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె వ్యాధులు వస్తున్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర ఆస్పత్రి వైద్యులు వెంకటశివకృష్ణ, వెంకటేష్, నౌషాద్, ఐఐటీ విద్యార్థులు, అమరా సంస్థల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఫిర్యాదు

తడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నారని పోలీసులకు ఫిర్యాదు అందింది. మండల పరిధిలోని వెండ్లూరుపాడు ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి వేనాటి గిరిరెడ్డికి అధికారులు అనుమతులు ఇచ్చారు. పనులను చేపట్టేందుకు స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో శుభ్రపరుస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి అడ్డుకున్నాడు. దీంతో గిరిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోట పోలీసుస్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఎస్‌ఐ పవన్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

వాకాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పంచాయతీ వడ్డిపాళెం శివారులో కోడిపందేల స్థావరంపై ఎస్‌ఐ నాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. మూడు కోళ్లు, రూ.1950 స్వాధీనం చేసుకుని, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామంలో ఉరివేసుకొని కిష్టయ్య(44) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన కిష్టయ్య ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నెర్రికాలువలో రంగు మారిన నీరు - కాలువలో ప్లాస్టిక్ బాటిల్స్, వ్యర్థాలు

నెర్రికాలువలోకి పట్టణ మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారంతో సాగునీరు కలుషితం ● ఆందోళనలో రైతులు

సూళ్లూరుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరందించే నెర్రికాలువలోకి సూళ్లూరుపేట పట్టణ మురుగంతా కలుస్తుండడంతో నీరంతా కలుషితమవుతోంది. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం కాలువలోకి చేరి సాగుకు ఉపయోగకరంగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలు చెందుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల రైతులకు వరప్రసాదిని నెర్రికాలువ. దొరవారిసత్రం మండలం తనియాలు నుంచి సూళ్లూరుపేట మీదుగా వచ్చి తడ మండలం గొల్లలమొలువు వద్ద నెర్రికాలువ ముగుస్తుంది. ఈ కాలువ కింద దాదాపు 16చెరువుల పరిధిలో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. పిండిపాలెం వద్ద కోటపోలూరు చెరువులో ఉన్న ఎస్ఎస్ ట్యాంకును కూడా నెర్రికాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా నింపి పట్టణానికి సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందిస్తున్నారు. అలాంటి నెర్రికాలువ పరిస్థితి నేడు ప్రశ్నార్థకరంగా మారింది. సూళ్లూరుపేట మండలం కోట పోలూరు రైల్వేగేటు వద్ద నుంచి చెంగాళమ్మ ఆలయం వద్ద వాటంబేడు రోడ్డు వరకు దాదాపు మూడు కిలో మీటర్ల మేర పట్టణంలో నెర్రికాలువ అంచున ఉన్న నివాసాల నుంచి వ్యర్థపునీరు కాలువల ద్వారా నెర్రికాలువలోకి కలుస్తోంది. మురుగునీరు కవడంతో సాగునీరంతా రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని కాలువల నుంచి వచ్చే వ్యర్థపునీరంతా నెర్రికాలువలో కలిసేలా మురుగు కాలువలు సైతం నిర్మించారు. దీనిపై రైతులు అధికారులకు మొరపెట్టుకుని లబోదిబోమన్న పట్టించుకునేవారే కరువయ్యారు. చెరువుల్లోకి కూడా పలుచోట్ల మురుగునీరు కలడంతో చెరువునీరంతా కూడా కలుషితమవతున్నాయి. నెర్రికాలువ బాగోగులు చూసుకోవాల్సిన అధికారులు సైతం తమకేం సంబంధం లేనట్లు ఉంటున్నారు. పాలకులూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నెర్రికాలువ ఆధునికీకరణ కోసం రూ.26 కోట్లు మంజూరైనా గత వైసీపీ పాలకుల పుణ్యంతో పనులు ముందుకు సాగలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులే స్వచ్ఛందంగా పూడిపోయిన నెర్రికాలువలో పూడిక తీసి, వ్యర్థాలను తొలిగించుకుని పొలాలకు సాగునీరు అందించుకొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణ మురుగు నెర్రికాలువలో కలువకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేగ నియంత్రణకు చర్యలేవీ?

ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు



సంగం థియేటర్ సెంటర్, రైల్వేస్టేషన్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు లేని మలుపులు

గూడూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పలు కూడళ్లు, మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురువుతున్నారు. స్థానిక సాయిబాబా గుడి సమీపంలో గూడూరు పట్టణానికి వచ్చే ప్రధాన రహదారిపై గతంలో ఉన్న స్పీడ్ బ్రేకరును తొలగించారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు, కల్యాణ మండపాలు, పెద్దసంఖ్యలో దుకాణాలు ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక సంగం థియేటర్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గం ద్వారా పట్టణంలోకి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. స్థానిక మోతీ మహల్ సెంటర్, ఏరియా ఆస్పత్రి ఎదురుగా, పాతబంస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వే స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ప్రతిరోజు ఏదో ఒకచోట వాహనాలు ప్రమాదాలకు లోనవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి కొత్త టీచర్లు

ఉత్తర్వులు అందుకున్న ఉమ్మడి నెల్లూరు అభ్యర్థులు

పాఠశాలల్లో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

నెల్లూరు(విద్య), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను విద్యాశాఖ పూర్తిచేసింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థులకు రెండురోజులపాటు నియామక పత్రాలను ఆన్‌లైన్‌లో అందచేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయడంతో ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అయ్యేలా పాఠశాలలన్నీ కోలాహలంగా మారనున్నాయి. కొత్త అయ్యోర్లు పాఠశాలలకు రానుండడంతో వారిని జాయినింగ్ చేసుకునేలా సర్వం సిద్ధం చేశారు.

నేడు విధుల్లో చేరిక

మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇప్పటికే వారికి పదిరోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి నియామక పత్రాలు అందచేశారు. జిల్లాలో విద్యార్థులు అత్యధికంగా ఉన్న పాఠశాలల్లో వీరిని నియమించారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలో మొత్తం 651 పోస్టులను భర్తీ చేశారు. వీటిలో ప్రభుత్వ జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 82, హిందీ 17, తెలుగు 29, ఉర్దూ 4, బయాలజీ 62, మ్యాథ్స్ 62, ఫిజికల్ సైన్స్ 74, సోషల్ 101, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 85 పోస్టులు కలిపి మొత్తం 619 భర్తీ అయ్యాయి. వీటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఎస్ఏ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, తెలుగు 1, ఉర్దూ 1 పోస్టులు, ఎస్‌జీటీ తెలుగు 13, ఉర్దూ 4 కలిపి 20 పోస్టులు, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఎస్ఏ విభాగంలో మ్యాథ్స్ 1, ఫిజికల్ డైరెక్టర్ 1, ఫిజికల్ సైన్స్ 1, ఎస్‌జీటీ తెలుగు 9 కలిపి మొత్తం 12 పోస్టులు భర్తీ చేశారు. మొత్తం మీద ప్రభుత్వ జడ్పీపీ, ఎంపీపీ పాఠశాలల్లో 619 పోస్టులు, కార్పొరేషన్ పాఠశాలల్లో 20, మున్సిపాలిటీ పాఠశాలల్లో 12 కలిపి మొత్తం 651 మంది కొత్త టీచర్లు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

పాఠశాలల్లో కొత్తగా చేరుతున్న ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలి. సోమవారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరిన వెంటనే ఆయా పాఠశాలల నుంచి బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులు వెంటనే రిలీవ్ అయి కావాలి. మంగళవారం నాటికి వారు బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి. అలాగే ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేరిన పాఠశాలల్లో రిలీవ్ చేయని వారిని కూడా వెంటనే రిలీవ్ చేసేలా ఎంఈవోలు చర్యలు చేపట్టాలి. కొత్తగా చేరిన టీచర్ల రిపోర్ట్ తేదీని పాఠశాల రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు వారి అర్హత సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. పత్రాలు సరిగాలేని వారి వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియచేయాలి.

- డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు

ఏటా డీఎస్సీ నిరుద్యోగులకు వరం: కురుగొండ్ల



డీఎస్సీలో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇకపై ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనుండడం నిరుద్యోగులకు వరం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించిన నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రామకృష్ణ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయలకు మేలు జరిగిందంటే ఒక్క టీడీపీ ప్రభుత్వంలోనేనని చెప్పారు. కొత్తగా ఉద్యోగంలో చేరబోతున్న ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో ఉత్తమ విలువలు

గార్లపాటి పురస్కార ప్రదానోత్సవంలో రమేష్‌నాథ్



పురస్కారాలు అందుకున్న ముక్తేశ్వరరావు, గోవిందు, గంగాధర ప్రసాద్, మల్లేశ్వరరావు, దామోదర్ నాయుడు తదితరులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజంలో ఉత్తమ విలువలు నెలకొల్పడానికి మార్గదర్శకం వహిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల అన్నారు. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో ఆదివారం విశ్వ సాహితీ సంస ఆధ్వర్యంలో గార్లపాటి పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. సాహిత్యం సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని, సాహితీ సేవా రంగంలో నిరంతరం కృషి చేస్తున్న రచయితలు, కవులు, పండితులను ఏటా సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థకు ఆయన రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, ప్రముఖ నవలా రచయిత మురిసెట్టి గోవిందు, సీనియర్ పాత్రికేయులు, కవి, అనువాదకులు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఉపాధ్యాయులు, కవి సురేంద్ర రొడ్డ, విశ్రాంత ఆచార్యులు, సంఘ సేవకురాలు ఆచార్య కట్టమంచి మహాలక్ష్మమ్మలకు గార్లపాటి పురస్కారాలను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఆదర్శ రైతులు ఏనుగు తారాపతి, దామా అయ్యప్ప నాయుడులకు ఏనుగు అంకమ నాయుడు సౌజన్యంతో రైతు పురస్కారాలను అందించారు. అనంతరం విశ్వ సాహితీ సంస్థ నిర్వాహకులు గార్లపాటి దామోదర నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సాహితీవేత్తలు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సుధాకర్ చౌదరి, శతావధాని ఆముదాల మురళి, రాస్ అధికారి నాగరాజు నాయుడు, పైనేని తులసీనాథం నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, మేమూరి జయరాం ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజు, వాకా ప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య రాజేశ్వరమ్మ, డాక్టర్ వి.కృష్ణవేణి, గంగవరపు శ్రీదేవి, తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ మౌని, ఆర్‌సీకేరాజు, డాక్టర్ పరమేశ్వరయ్య, డాక్టర్ మస్తానమ్మ, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జునలతోపాటు పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి




పెళ్లకూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మండలంలోని అక్కగారిపేట వద్ద 71వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని హైవే అంబులన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 ఏళ్ల ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ నాగరాజు చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 9440796358 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మంత్రి ఆనంకు సత్కారం



డక్కిలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని డక్కిలి మండలం ఆల్తూరుపాడు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాసరం చైతన్య రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నెల్లూరులోని ఆనం నివాసంలో మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు.

కోటమ్మకు పూజలు



కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాస్టర్ డే సంబరాలు

కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు చర్చిల్లో ఆదివారం పాస్టర్ డే సంబరాలు జరిగాయి. అల్లంపాడు చర్చిలో బాబు దంపతులను సన్మానించ్చారు. పాముల సురేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదేవిధంగా గూడలి, కొండమిట్ట, చిట్టేడు, తిన్నెలపూడి, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోట పాంతాల్లో పాస్టర్‌డే సంబరాలు జరిగాయి.

నేత్రదానం



పురుషోత్తం(ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గాంధీమందిరం సెంటర్ వద్ద నివసిస్తున్న కావేరిపాకం పురుషోత్తం(48) బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కార్మికులకు అందేలా కృషి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాంత్‌ప్రకాశ్‌జాటవ్

గూడూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను కార్మికులకు అందేలా నాయకులు కృషి చేయాలని బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు శాంత్‌ప్రకాశ్‌జాటవ్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణలోని బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో బీజేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాలి మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో కార్మికసంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటత కార్మికుల శ్రేయస్సు కోసం బీజేఎంఎస్ కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాలి మధుసూదన్ యాదవ్, బాలకృష్ణ, సంతోష్, ప్రశాంత్, యశ్ పవార్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు, గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు కోరారు. ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు సైనికుల్లా పనిచేశారని, అయితే వారిపై కేసులు నమోదు చేయడం బాధాకరమని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ఆ కేసులను ఎత్తివేయాలన్నారు. ఖాళీగా ఉన్న 519 సెక్షన్ ఆఫీసర్ల పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టుల్లో 30శాతం పంచాయతీరాజ్ ఇంజనీర్లకు కేటాయించాలని కోరారు.

భర్తల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భార్యల నుంచి భర్తలకు రక్షణ కల్పించడంతోపాటు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని భార్యా బాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బాలాజీరెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు సహజమని తెలిపారు. భర్తపై భార్య కేసు పెడితే చట్టాలు చాలా కఠినంగా అమలువుతున్నాయని, అదే తరహాలో భర్తలు పెట్టే కేసుల విషయంలోనూ చట్టాలు కఠినంగా ఉండాలని కోరారు. లీగల్ అడ్వైజర్ మునిబాబు, చంద్రకళారెడ్డి, దాసు, నాగరత్న పాల్గొన్నారు.

కరకంబాడి వీఆర్వోపై దౌర్జన్యం: పోలీసులకు ఫిర్యాదు




పనులను అడ్డుకుంటున్న వీఆర్వో - వివాదాస్పద భూమిలో చేపట్టిన భవన నిర్మాణ పనులు

రేణిగుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వీఆర్వోపై భవన నిర్మాణ కార్మికులు దౌర్జన్యం చేశారు. శ్రీకాళహస్తి రోడ్డులోని 65 ఎకరాల ప్రభుత్వ భూమిపై కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. అయితే ఈ భూమికి సంబంధించిన స్థలాన్ని తూకివాకం లెక్కదాఖలా సర్వే నెంబరు చూపుతూ రిజిస్ట్రేషన్ చేసుకుని భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బందితో భవన నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు కరకంబాడి వీఆర్వో రమేష్‌పై దౌర్జన్యం చేస్తూ విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సూచనలతో వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో పనులను అడ్డుకున్నారు. పంచాయతీ అనుమతులు ఉండడంతోనే నిర్మాణ పనులు చేస్తున్నామని భవన యజమానులు చెబుతున్నారు.

ఏపీపీఆర్ఎంఈ అసోసియేషన్ కార్యవర్గం



శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీపీఆర్ఎంఈ) ఎన్నికలు జరిగాయి. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా శశిధర్, ప్రధాన కార్యదర్శిగా చెంచురత్నం యాదవ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లుగా లక్ష్మీపతియాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రపాణి, త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులుగా మూర్తి, వాణి, లోకేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా అలీ, లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యలను ముందుండి పరిష్కరిస్తామని కొత్తగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

పుత్తూరు వార్తలు

'విలీన' సమస్య పరిష్కారమయ్యేనా?



డీపీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు(ఫైల్‌ఫొటో)

వడమాలపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం మండలంలోని మూడు పంచాయతీలను అడ్డగోలుగా ఇతర పంచాయతీల్లో విలీనం చేసింది. దీనిపై ఆగ్రహించిన స్థానికులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. ఫలితంగా ఆరు పంచాయతీలకు, ఆ పరిధిలోని రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిలిపివేశారు. ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కార్యదర్శుల పాలనలో సదరు పంచాయతీలు కనీస వసతులకు నోచుకోలేదు. మండలంలోని చింతకాల్వ పంచాయతీని కాయం కు, కల్లూరును టీసీ అగ్రహారానికి, సీతారామపురాన్ని బాలినాయుడు కండ్రిగ పంచాయతీల్లో విలీనం చేశారు. పంచాయతీరాజ్ నిబంధనల మేరకు పంచాయతీని తొలగించాలన్నా, విలీనం చేయాలన్నా గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు చర్యలు తీసుకోవాలి. అయితే వైసీపీ నాయకులకు తలొగ్గిన అప్పటి అధికార యంత్రాంగం తప్పుల తడకగా ప్రతిపాదనలు తయారు చేసి పంపడంతో జిల్లా యంత్రాంగం అడ్డగోలుగా విలీన ప్రక్రియకు ఆమోదం తెలిపింది. దీనిపై ఆయా పంచాయతీల ప్రజలు కోర్టుకెక్కారు. దీంతో చింతకాల్వ, కాయం, కల్లూరు, టీసీ అగ్రహారం, సీతారామపురం, బాలినాయుడు కండ్రిగ పంచాయతీలకు సంబంధించి పాదిరేడు, పూడి ఎంపీటీసీ స్థానాల ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. ఈక్రమంలో స్థానిక సంస్థల ప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందగా తయారైందని స్థానికులు విమర్శిస్తున్నారు. విలీన వ్యవహారంపై కోర్టుకి వెళ్లి ఐదేళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేదు. జిల్లా యంత్రాంగం ఆయా పంచాయతీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇటీవల ఆరు పంచాయతీల పరిధిలోని టీడీపీ నాయకలు డీపీవో సుశీలదేవికి పంచాయతీలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోగా పునరుద్ధరించాలని విన్నవించారు.

జోరుగా 'వార్డు శుభ్రత - మనందరి బాధ్యత'



పుత్తూరు అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పుత్తూరు పట్టణంలోని 19వ వార్డులో ఆర్టీసీ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి కృష్ణకుమార్ ఆధ్వర్యంలో మన వార్డు శుభ్రత - మనందరి బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ వార్డులోని యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు.

కాలువను కప్పేసిన పిచ్చిమొక్కలు



పుత్తూరు అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పిల్లారిపట్టు హరిజనవాడ నుంచి వెళ్లే మురుగునీటి కాలువలో మురుగు కదలడం లేదు. ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతోంది. పరిస్థితిని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. కాలువను పిచ్చి మొక్కలు కప్పేయడంతో ఆనవాళ్లు కూడా కనబడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత పారిశుధ్య సిబ్బంది స్పందించి మొక్కలను తొలగించి కాలువలను శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

సురేంద్రకు గార్లపాటి సాహితీ పురస్కారం



వడమాలపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కవి, రచయిత, గాయకుడు, సాహితీ సేవకుడు రొడ్డ సురేంద్ర గార్లపాటి సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం తిరుపతి రాస్ భవన్‌లో జరిగిన సాహితీ సభలో 2025వ సంవత్సరానికి విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో పురస్కారం, ఐదువేల రూపాయల నగదు, జ్ఞాపికను సంస్థ అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. సాహితీ సభలో ఆకాశవాణి విశ్రాంత డైరక్టర్ మల్లేశ్వరరావు, శతావధాని ఆముదాల మురళి, సాకం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సురేంద్ర వడమాలపేటలో పీఎంశ్రీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

వడమాలపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి- చెన్నై జాతీయ రహదారిలో అంజేరమ్మ కనుమ వద్ద ఆదివారం లారీ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన నవనీత తన అల్లుడు శంకర్‌తో కలసి బైక్‌పై రేణిగుంటకు వెళ్తుండగా అంజేరమ్మ కనుమ వద్ద చెన్నై నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో నవనీత చెయ్యి లారీ వెనుక చక్రం కింద పడి నలిగిపోయింది. తీవ్రంగా గాయపడిన నవనీత, శంకర్ చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరుకు చెందిన నాగేశ్వరమ్మ దంపతులు రూ.51వేలు విరాళంగా అందజేశారు. చెక్కును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వంతెన నిర్మించండి సారూ..!





2021లో వంతెన నిర్మాణం, రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన బోర్డు - వంతెన నిర్మించాల్సిన కాలువ - అస్తవ్యస్తంగా ఉన్న మట్టి రోడ్డు

కేవీబీపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు పంచాయతీ కొట్టాలమిట్ట గిరిజనకాలనీకి వంతెన, సరైన రోడ్డు లేక స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో ఇక్కడ కళత్తూరు కాలువపై వంతెన నిర్మాణానికి, రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.97కోట్లతో ప్రారంభిస్తున్నట్టు 2021లో శిలాఫలకాలు వేశారు. అయితే ఏ విధమైన పనులు చేపట్ట లేదు. సుమారు 70 కుటుంబాల గిరిజనులు ఈ కొట్టాల మిట్ట కాలనీలో నివసిస్తున్నారు. వర్షాకాలంలో కళత్తూరు కాలువ ఉధృతంగా పారుతుంది. ఆ కాలువ దాటే ప్రధాన రోడ్డుకు చేరుకోవాల్సి ఉంది. వీరికి ఈమార్గం తప్పితే మరో దారి లేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు, వంతెన నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అవి కూడా కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో మళ్లీ ప్రజలకు వర్షాకాలం వస్తే కాలువ దాటాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

భక్తజన సంద్రం... వాయులింగేశ్వరుడి ఆలయం



శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది.వారాంతపు సెలవులతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 511 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,770, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 316మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,904 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,272, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 294మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 233మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 75మంది భక్తులు పూజలు చే యిం చుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,565 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే కూటమి లక్ష్యం



నియామకపత్రం అందిస్తున్న బొజ్జల బృందమ్మ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): యువకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆద్విక ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మేళాకు యువత పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎంపికైన వారికి బృందమ్మ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉపాధి కల్పించడంలో పెద్దపీట వేస్తోందన్నారు. పలువురు పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఎమ్మెల్యే సుధీర్ మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూడా పరిశ్రమలు వస్తున్నాయని దీంతో పరిశ్రమల హబ్‌గా మారిందన్నారు. ఆద్విక ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు, రావిళ్ల మునిరాజానాయుడు, కాసరం రమేష్, జి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఉత్తరాఖండ్ ఐఏఎస్ అధికారులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం ఉత్తరాఖండ్ చీఫ్ సెక్రటరీ ఆనంద్‌బర్ధన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం మాజీ సర్పంచి శాఖమూరి సుబ్రమణ్యంనాయుడి మృతి



నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ వీఆర్వో, మాజీ సర్పంచి, సింగిల్ విండో మాజీ వైస్ ప్రెసిడెంట్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించిన పుత్తూరు మం డలం రామసముద్రం గ్రామ వాసి శాఖమూరి సుబ్రమణ్యంనాయుడు ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు ఆయనకు నివాళులర్పించి, సంతాపం తెలియజేశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా 'ప్రేరణ' ఈవెంట్



రేణిగుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి రాస్‌లో ఆదివారం ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లే అండ్ లెర్న్ ఈవెంట్ ఉత్సాహంగా సాగింది. దివ్యాంగ పిల్లలకు క్రీడా పరికరాలు అందించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి ఆటలాడి ఆనందాన్ని పంచారు. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ కోశాధికారి తరుణ్, సభ్యులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రహ్లాద భక్తి ప్రవచనాలు



శ్రీనివాస రామానుజదాస్‌ను సత్కరిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మ శ్రమం ఆధ్వర్యంలో జరిగిన ప్రహ్లాద భక్తి ప్రవచనం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి, ఉపన్యాసకుడు శ్రీనివాస రామానుజ దాసును ముక్కంటి ఆలయ ధర్మకర్తమండలి మాజీ అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ శుక బ్రహ్మ శ్రమం ఆధ్వర్యంలో ప్రహ్లాద భక్తి ఆధ్యాత్మిక ప్రవచనాలు జరగడం సంతోషకరమన్నారు. సాధన ద్వారా ముక్తి యోగం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగరాల గణేష్, పేట జనార్దన్, ఉదయ్‌కుమార్, బాలాగౌడ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం అభినందనీయం

క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా రవాణా చేస్తున్న బాణసంచాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రెండు రోజుల క్రితం రూ.లక్షల విలువైన టపాకాయలను తిరుపతి పోలీసులు పట్టుకోవడం అభినందనీయమని తిరుపతి క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అక్రమ బాణసంచాను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సొసైటీ పేరుతో టీటీడీ ఉద్యోగులకు టపాకాయలను విక్రయించాలని, ఆ పేరుతో కొందరు వ్యాపారం చేస్తుండటం సమంజసం కాదని అన్నారు.

దేశాభ్యున్నతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



ప్రార్థనలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అభ్యున్నతే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని సంఘం ఉపాధ్యాయ విభాగ్ ప్రముఖ్ బి.జయచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని నీర్పాకోటలో ఆంజనేయ ఆలయ ఆవరణలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి కావడంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రార్థన సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధనం, స్వదేశీ వస్తువుల సేకరణ, పౌర నియమాలు, పర్యావరణం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ గురుస్వామి, ఖండ ధర్మప్రచారక్ హనుమంతురెడ్డి, మార్కండేయులు, రమణయ్య, సుబ్రమణ్యం తదతరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సీఐటీయూ జిల్లా మహాసభలు

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని వీఎస్ఎన్ కల్యాణ మండపంలో సోమ, మంగళవారాల్లో సీఐటీయూ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 2 గంటలకు పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా కల్యాణ మండపం వరకు ర్యాలీ ఉంటుందని వివరించారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు సీహెచ్ నరసింగరావు, అజేయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మహిళలకు సూచనలిస్తున్న సీఐ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు బయటకు వచ్చినప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ తిమ్మయ్య తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలో మహిళలకు ఆదివారం పలు అంశాలుపై అవగాహన కల్పించారు. ప్రధాన రహదారిలో ఆటోలను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఆటో డ్రైవర్లును హెచ్చరించారు. రోడ్డుపై ఆటోలు ఆపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలురు, బాలికల వసతిగృహాలను ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. వసతిగృహాల్లో ఎవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని విద్యార్థులకు సూచించారు. అ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెను ప్రకారం భోజనం పెట్టాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వసతిగృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిందేపల్లి సబ్‌స్టేషన్‌కు రోడ్డు నిర్మాణం



జోరుగా జరుగుతున్న నిర్మాణ పనులు

ఏర్పేడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందేపల్లి సబ్‌స్టేషన్‌కు తారు రోడ్డు నిర్మించనున్నారు. చిందేపల్లి రెవెన్యూ పరిధిలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్ ద్వారా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటి సౌకర్యార్థం ప్రభుత్వం రూ.2కోట్లతో చిందేపల్లి నుంచి సబ్‌స్టేషన్ వరకు తారు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టింది. నెలరోజులుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నెలాఖరుకు పనులు పూర్తవుతాయని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఈరోడ్డు నిర్మాణం పూర్తయితే చిందేపల్లి మీదుగావెళ్లే పలు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

ఘనంగా పాస్టర్స్ డే

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాస్టర్స్ డేను పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో పాస్టర్ జాన్‌వెస్లీ సంఘ సభ్యులతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన వాక్యం అందించడానికే దేవుడు పాస్టర్లను ఏర్పాటు చేసుకున్నాడని, ఆ వాక్యం బైబుల్ ప్రకారం బోధిస్తున్నామని చెప్పారు.